# కనుల పండువగా రథోత్సవం



వీరభద్రస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



ఆలయంలో ఉత్సవమూర్తులు

కురవి, మార్చి 13 : భద్రకాళీ సమేత వీర భద్రస్వామి కల్యాణ బ్రహోత్మవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం రాత్రి రథోత్సవం కనుల పండువగా కొనసాగింది. నెలవంక తోడురాగా భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్ర స్వామి కొలువుదీరిన పురాతన రథం భక్తుల జయజయధ్వానాల నడుమ ముందుకు కదిలింది. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. జై వీరభద్ర... జైజై వీరభద్ర నామస్మరణతో కురవి ఆలయ పరిసరాలు మార్మోగాయి. శివ సత్తులు వీరగోలలు చేతబూని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ పూజారులు పెనుగొండ అనిల్, రెడ్యాల శ్రీనివాస్ సారథ్యంలో వేద పండితులు పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు పూజారులు హారతి ఇచ్చి, రంగురంగుల పూలు, విద్యుత్ దీపకాంతులతో అలంకరించిన రథాన్ని భక్తులు లాగి పరవశించిపోయారు. స్వామివారి రథాన్ని లాగితే సర్వపాపాలు హరించబడుతాయని భక్తుల నమ్మకం.

### ఆడబిడ్డకు ఆత్మీయ స్వాగతం

భద్రకాళీ అమ్మవారిని కోయ(గిరిజను)లు తమ ఆడబిడ్డగా భావిస్తారు. ప్రతి సంవత్సరం రథోత్సవం రోజునే కోయలు ఎక్కువగా హాజరై మొక్కులు చెల్లించుకుంటారు. ఈ సారి కూడా భారీ సంఖ్యలో హాజరై రథం ఎదుట తన్మయత్వంతో నృత్యం చేశారు. ఒడి బియ్యం చల్లి, రథానికి ఎదురుగా కొబ్బరికాయలు కొట్టి, సంప్రదాయ పూజలు చేశారు. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు డీఎస్పీ తిరుపతిరావు పర్యవేక్షణలో రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్సై గోపీ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. రథం చుట్టూ రోప్ వేసి భక్తులు రాకుండా నిలువరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్ రెడ్డి, ఈవో శ్రావణపు సత్యనారాయణ, ధర్మకర్తలు పాల్గొన్నారు.



ఎంపీ కవితలో కలిసి రైల్వే జీఎంకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

## గార్ల రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలి

గార్ల, మార్చి13: గార్ల రైల్వే స్టేషన్‌లో శాతవాహన లేదా ఇంటర్‌సిటీ రైళ్ల హాల్టింగ్ కల్పించాలని, రెండుప్లాట్ ఫాంలు అదనంగా పెంచాలని కోరుతూ రైల్వే జీఎం అరుణ్ కుమార్‌జైన్‌కు బుధవారం ఎంపీ మాలోత్ కవితతో కలిసి గార్ల మండల నాయకులు వినతి పత్రాన్ని సికింద్రాబాద్‌లో సమర్పించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవకులు, గార్ల రైల్వే కమిటీ నాయకులు కందునూరి ఈశ్వర్‌లింగం, పానుగంటి రాధాకృష్ణ, ఎంఏ జలీల్, బుడిగ మురళీ గౌడ్, గంజి ఈశ్వరలింగం, మాలోత్ లాల్‌సింగ్, బాదం రాజేశ్, సోమ్లానాయక్, కుంగ్‌పూ శ్రీను, దాశరథి రాము పాల్గొన్నారు.

### పద్మావతి ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ ఇవ్వాలి

డోర్నకల్, మార్చి 13 : డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలని సికింద్రాబాద్ రైల్ నిలయంలో జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు ఎంపీ మాలోత్ కవిత వినతిపత్రం అందజేశారు. డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు ఖాదర్‌పాషా ఎంపీ కవితకు కృతజ్ఞతలు తెలిపారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

## శివారు కాలనీలను అభివృద్ధి చేస్తాం..

### ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్, మార్చి 13 : మహబూబాబాద్ మున్సిపాలిటీలోని శివారు కాలనీలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం వారు మున్సిపాలిటీలోని ఎల్‌బీజీ నగర్ కాలనీలో రూ.14వ ఫైనాన్స్ నిధులు రూ.5లక్షలతో సీసీ రోడ్లు, మరో రూ.5 లక్షల జనరల్ ఫండ్‌తో సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని 36 వార్డులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తామని వెల్లడించారు. అనంతరం 26వ వార్డు డంపింగ్ యార్డు రోడ్డులో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ రవీందర్ యాదవ్, డీఈ ఉపేందర్, సీపీఎం ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య, కౌన్సిలర్ బానోత్ పద్మా సీతారాంనాయక్, పోతరాజు రాజు, చుక్కల ఉదయ్‌చందర్, ఎడ్ల రమేశ్, డౌలాగర్ శంకర్, భూక్యా శ్రీను, శివకుమార్ పాల్గొన్నారు.

## గృహలక్ష్మిని వినియోగం చేసుకోవాలి

డోర్నకల్, మార్చి 13 : గృహలక్ష్మీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీ రమేశ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని రాజుతండాలో లబ్ధిదారులకు ఆయన జీరో కరెంట్ బిల్లు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీరో బిల్లులు ఇన్ టైంలో లబ్ధిదారులకు ఇవ్వాలని విద్యుత్ శాఖ సిబ్బందికి సూచించారు. రాజుతండాలో ప్రజలు కరెంట్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని ఏడీ దృష్టికి తీసుకెళ్లగా, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామన్నారు.

## గంగమ్మగుడిలో చోరీ

గూడూరు, మార్చి13 : మండల కేంద్రంలోని గంగమ్మతల్లి గుడిలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ బాధ్యుల కథనం ప్రకారం.. పాకాలవాగు సమీపంలోని గంగమ్మ గుడి తాళాలు పగులగొట్టి అమ్మవారి ముక్కు పుడక, హుండీని దొంగలు అపహరించారు. గుడికి కొద్ది దూరంలో హుండీ పగులగొట్టి అందులోని డబ్బులు ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆలయ బాధ్యులు తెలిపారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

డోర్నకల్, మార్చి 13: చిలుకోడు గ్రామస్తుడు బాదరబోయిన వెంకయ్య(60) ఇటీవల మృతి చెందాడు. బుధవారం మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు రాయల వెంకటేశ్వర్లు, కాడెం బాబు, రాయల నరేశ్, దేశిని ఉపేందర్, కాడెం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
WANTED HOSPITAL STAFF
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్లార్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043. NTW-323227
★GNM నర్సులు, మెడికల్ షాప్ సేల్స్‌మెన్ మరియు Lab-టెక్నీషియన్స్ అనుభవం గల వారు కావలెను. సంప్ర: గ్లార్డియన్ హాస్పిటల్, ములుగు 'X' రోడ్, వరంగల్. 12 to 2PM. NTW-0362
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు
అత్యధిక ప్రచారం
గమనిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

## విద్యార్థులు 10/10 సాధించాలి

### నోడల్ హెచ్‌ఎం కొత్త జగన్మోహన్‌రెడ్డి

కేసముద్రం, మార్చి 13: పదో తరగతి విద్యార్థులు 10/10 సాధించేందుకు కృషి చేయాలని నోడల్ హెచ్‌ఎం కొత్త జగన్మోహన్‌రెడ్డి, సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ అన్నారు. మండలంలోని కేసముద్రం విలేజ్ హైస్కూల్‌లో బుధవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధ్యక్షుడు సమ్మయ్య గౌడ్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సామల నర్సయ్య, మోడెం రాజు, రఘోత్తంరెడ్డి, వల్లందాసు రవి, తుంపిళ్ల వెంకన్న, కొలిపాక వెంకన్న, కీర్తి సురేందర్, చిట్ల రవి, బీరు వెంకన్న, ఉపాధ్యాయులు సత్యనారాయణ, నాగమణి, జ్యోతి, రామయ్య, పార్వతి, శ్రీనివాస్, పద్మ పాల్గొన్నారు.

## గంజాయి కేసులో జైలు శిక్ష

గూడూరు, మార్చి 13 : గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ నలుగురికి మహబూబాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి చంద్రశేఖర్‌ప్రసాద్ 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధించినట్లు ఎస్సై నగేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021లో 169/2021 నేర సంఖ్యలో నమోదైన కేసులో వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట షేక్ ఇస్మాయిల్, గూడూరు మండలం కోబల్‌తండాకు ధరంసోత్ శ్రీనివాస్, బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ధరావత్ కిరణ్, దుగ్గొండి మండలం చాపలబండ గ్రామానికి చెందిన పల్లకొండ సాంబమూర్తికి 20 సంవత్సరాల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.



వెన్నారంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న రెడ్యానాయక్

## ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి

డోర్నకల్, మార్చి 13 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. బుధవారం వెన్నారం గ్రామంలో ధ్వజస్తంభం, మహాగణపతి, ఆంజనేయస్వామి, నాగేంద్రస్వామి, ముత్యాలమ్మ తల్లి, నవగ్రహ, శివలింగ, కట్టమైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలన్నారు. మాజీ సర్పంచ్ బీ వెంకన్న, కాడెం భిక్షం, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధించాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 13 : బహిరంగ ప్రదేశాల్లో ధూమపాన నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు పరికిపండ్ల అశోక్ అన్నారు. బుధవారం పట్టణంలోని హైమా గార్డెన్‌లో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నో స్మోకింగ్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. పొగ తాగడం వల్ల శ్వాసకోశ వ్యాధులు వస్తాయని, లంగ్స్ క్యాన్సర్, గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా బస్టాండ్, రైల్వే స్టేషన్లలో ధూమపాన నిషేధాన్ని అమలు చేయాలన్నారు. జాతీయ ఆరోగ్య సంస్థ సర్వే ప్రకారం మగవారిలో 22శాతం, స్త్రీలలో 6 శాతం ధూమపానానికి బలి అవుతున్నారని, దీనిని నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో వంకాయల పాటి లెనిన్‌బాబు, బండి వెంకటరెడ్డి, శ్రవణ్ కుమార్, నవీన్‌రెడ్డి, కోటేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## క్షయ రహిత గ్రామంగా నిధానపురం

దంతాలపల్లి, మార్చి 13: క్షయ వ్యాధి (టీబీ) రహిత గ్రామంగా మండలంలోని నిధానపురం గ్రామం ఎంపికైనట్లు మండల టీబీ నోడల్ పర్సన్ చలపతి తెలిపారు. రెండేళ్లలో గ్రామంలో ఒకరికి కూడా టీబీ వ్యాధి సోకలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో భాగంగా మార్చి 24న ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా క్షయ వ్యాధి రహిత గ్రామాలను అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం పీహెచ్‌సీలో జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి మురళీధర్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు డాక్టర్ ప్రియాంక, సందీప్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

మహబూబాబాద్ రూరల్, మార్చి 13 : చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన మండల శివారులో బుధవారం జరిగింది. రూరల్ ఎస్ఐ దీపికారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని ఇందిరానగర్ తండాకు చెందిన మాలోత్ అనిత (28), నరేశ్ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. తమకు ఉన్న రెండు ఎకరాల మిర్చి తోటతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశారు. మిర్చి తోటకు గుబ్బ వైరస్ సోకి పంట చేతికి రాకుండా పోయింది. పెట్టుబడి కోసం రూ.రెండు లక్షల వరకు అప్పు చేశారు. పెట్టుబడికి అప్పుగా తెచ్చిన డబ్బులు అడుగుతుండడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన అనిత ఈ నెల 9న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగింది. స్థానికులు ఏరియా వైద్యశాలకు తరలించగా, చికిత్స పొం దుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. భర్త నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనితకు పాప, బాబు ఉన్నారు.




పట్టుపడిన 14 ఇసుక ట్రాక్టర్లను చూపుతున్న తొర్రూరు డీఎస్పీ సురేశ్

## అక్రమంగా ఇసుక రవాణా చేస్తే పీడీ యాక్టు

### • 14 ఇసుక ట్రాకర్ల సీజ్ • వెల్లడించిన తొర్రూరు డీఎస్పీ సురేశ్

నెల్లికుదురు, మార్చి 13 : నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని తొర్రూరు డీఎస్పీ సురేశ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో తొర్రూరు సీఐ సంజీవ, నెల్లికుదురు ఎస్సై కే క్రాంతి కిరణ్‌తో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను రవాణా చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనుమతి పత్రాలు లేకుండా ఆకేరు వాగు నుంచి ఇసుకను రవాణా చేస్తున్న జెల్ల యాకయ్య(బ్రాహ్మణకొత్తపల్లి), జెల్లక మహేశ్(పార్వతమ్మగూడెం), జెల్లక యాకయ్య(కోమటిపల్లి), బట్ల యాకూబ్(నెల్లికుదురు), మాదాసు రవి (నెల్లికుదురు), హెచ్ అశ్విన్ (నెల్లికుదురు), పెరుమాండ్ల ప్రదీప్ (బ్రాహ్మణకొత్తపల్లి), జాటోత్ రవి (దుబ్బ తండా), పయ్యావుల ప్రవీణ్ (పోలెపల్లి), రేఖ అశోక్ (రావిరాల), నీదనపల్లి ప్రవీణ్ (పార్వతమ్మగూడెం), తరుణ్ (రావిరాల)కు చెందిన 14 ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి మైనింగ్ శాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అంతక ముందు మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు సీఐ సంజీవ, నెల్లికుదురు ఎస్సై క్రాంతి కిరణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వెంకన్నను సన్మానిస్తున్న ఎంఈవో, టీచర్లు

## అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

బయ్యారం, మార్చి 13: అంకిత భావంతో పనిచేస్తేనే మంచి గుర్తింపు లభిస్తుందని ఎంఈవో పూల్‌చంద్, విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటరెడ్డి, ఆర్వీ ప్రసాద్‌రావు అన్నారు. మండలం కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయుడు బస్వ వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పడం సాధారణమన్నారు. అందుకు భిన్నంగా ఉపాధ్యాయుడు వెంకన్న తాను పని చేసిన ప్రతి చోట విద్యార్థుల బాగు కోసం తపించేవాడని, దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధి కృషి చేసేవారని తెలిపారు. ఉద్యోగ విరమణ పొందినా సేవా స్ఫూర్తిని కొనసాగించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవేంద్రాచారి, ఉపాధ్యాయులు రవీందర్, భిక్షం ,శేషు, సరోజ, విశ్రాంత ఉపాధ్యాయులు సాంబశివరావు, హనుమంత ప్రసాద్ పాల్గొన్నారు.

## లే ఔట్ పరిశీలన

డోర్నకల్, మార్చి 13: మున్సిపాలిటీ పరిధిలోని ట్రాంక్ తండా సమీపంలో ఉన్న లే ఔట్‌ను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోపో పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణవాసులు రోడ్లపై చెత్తాచెదారం వేయవద్దన్నారు. డంపింగ్ యార్డు స్థలం కోర్టు కేసులో ఉందని మున్సిపల్ కమిషనర్ నరేశ్‌రెడ్డి అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేశ్‌రెడ్డి, టీపీఎస్ రమేశ్, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ హమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఎంపీ అభ్యర్థిగా సీతారాంనాయక్

మహబూబాబాద్ రూరల్, మార్చి 13 : బీజేపీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా అజ్మీరా సీతారాంనాయక్‌ను ఆ పార్టీ అధిష్ఠానం బుధవారం సాయంత్రం ప్రకటించింది. సీతారాంనాయక్ గతంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు. 2014 ఎన్నికల్లో మానుకోట పార్లమెంట్ స్థానం నుంచి టీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి భారీ మెజార్టీతో గెలుపొందారు. 2014 నుంచి 2019 వరకు మానుకోట ఎంపీగా కొనసాగించారు. 2019 నుంచి 2024 వరకు బీఆర్‌ఎస్ లోనే కొనసాగారు. ఇటీవల బీజేపీలో చేరిన సీతారాంనాయక్‌కు ఆ పార్టీ అధిష్ఠానం మానుకోట పార్లమెంట్ స్థానానికి ఎంపిక చేసింది.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్, మార్చి 13 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌తో కలిసి నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్ టీమ్, మీడియా మానిటరింగ్ సర్టిఫికేషన్ కమిటీ, సోషల్ మీడియా, సీ విజిల్, సువిధ యాప్, చెక్‌పోస్టుల నిర్వహణ, ఆయుధాల అప్పగింత, ఎన్నికల సమయంలో అనుమతులు, పోలీస్, ఎన్నికల విభాగం సిబ్బంది నియామకం తదితర అంశాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మాట్లాడుతూ... ఎన్నికల నిర్వహణలో పోలీసుల పాత్ర కీలకమని, అందరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, తప్పుడు సమాచారం పోస్టు చేయకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం డేవిడ్, అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, డీఎస్పీలు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

## మెడికల్ కాలేజీలో ఉద్యోగాలకు దరఖాస్తులు

### కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్, మార్చి 13 : మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్స్, సీనియర్ రెసిడెంట్స్ ఉద్యోగాలకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీలతో పాటు మహబూబాబాద్ మెడికల్ కాలేజీలో 6 ప్రొఫెసర్లు, 22 అసోసియేట్ ప్రొఫెసర్లు, 12 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 29 ట్యూటర్స్, 27 సీనియర్ రెసిడెంట్స్ ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అర్హత ఉన్నవారు కులం, నివాస, ఇతర ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 16 ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రభుత్వ వైద్య కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగతా వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. ప్రొఫెసర్లకు రూ.1.90లక్షలు, అసోసియేట్స్ ప్రొఫెసర్లకు రూ.150లక్షలు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రూ.1.25 లక్షలు, ట్యూటర్స్‌కు రూ.55 వేలు, సీనియర్ రెసిడెంట్స్‌కు రూ.92,575 వేతనాలు చెల్లిస్తారని పేర్కొన్నారు.

## సమస్యలు వినకుండా ఎమ్మెల్యే వెళ్లిపోవడం బాధాకరం

తొర్రూరు, మార్చి 13: మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశంలో వార్డు సమస్యలు ప్రస్తావిస్తున్నా ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి పట్టించుకోకుండా వెళ్లిపోవడం బాధాకరమని కౌన్సిలర్ పేర్న యమున ఆవేదన వ్యక్తం చేశారు. దళిత మహిళా కౌన్సిలర్ అయిన తాను చైర్ పర్సన్ అనుమతితో మాట్లాడుతుండగా మధ్య లోనే ఎమ్మెల్యే లేచి ఎలాంటి సమాధానం ఇవ్వకుండా వెళ్లిపోయారని తెలిపారు.

## ప్లాస్టిక్ వాడకంతో అనేక నష్టాలు

మహబూబాబాద్ రూరల్, మార్చి 13 : నిత్య జీవితంలో ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక నష్టాలు ఎదురవుతాయని జిల్లా విద్యా శాఖ అధికారి రామారావు అన్నారు. బుధవారం పట్టణంలోని మార్గదర్శి బీఈడీ విద్యాలయంలో 'ప్లాస్టిక్ – ప్రత్యామ్నాయాలు' అనే అంశంపై ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయాల వాడకంతోనే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. లేకపోతే భవిష్యత్ తరాలకు చాలా ముప్పు ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో విద్యాసాగర్, ఆజాద్, యుగేంధర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్

## నీటి ఎద్దడిని నివారించాలి : ఎమ్మెల్యే

కురవి, మార్చి 13 : రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు సమన్వయంతో పనిచేసి నీటి ఎద్దడిని నివారించాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రూనాయక్ అన్నారు. కురవి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నీటి ఎద్దడి నివారణపై అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంపీపీ గుగులోత్ పద్మావతి, ఎంపీడీవో వీరబాబు, తహసీల్దార్లు సునీల్‌రెడ్డి, శారద, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విచక్షణారహితంగా దాడి

కురవి, మార్చి 13 : మండలంలోని తిర్మలాపురం గ్రామంలో చేపల పెంపకం డబ్బుల గొడవ దాడికి తెరతీయడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి కథనం ప్రకారం... గ్రామంలో మూడు సంవత్సరాలుగా చెరువులో చేపల పెంపకం డబ్బుల విషయంలో గొడవ జరుగుతున్నది. మాజీ సర్పంచ్ కొర్ని రాంబాబు వద్ద ఉన్న డబ్బులు ఇవ్వాలని పలుమార్లు పంచాయితీ నిర్వహించినా ఇవ్వలేదు. దానిని దృష్టిలో పెట్టుకుని మంగళవారం రాత్రి అకారణంగా గుమ్మడి ఎల్లాస్వామిపై గొడ్డలితో విచక్షణా రహితంగా కొర్ని రాంబాబు, అతడి తమ్ముళ్లు శ్రావణ్, అనిల్ దాడి చేశారు. కుటుంబ సభ్యులు ఎల్లాస్వామిని వెంటనే మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించారు. కురవి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

గూడూరు, మార్చి 13 : విద్యార్థినులు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని షీ టీమ్ ఎస్సై సునంద అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని కస్తూర్బా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నప్పుడు 100కు డయల్ చేయాలని, ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు భయపడకుండా షీం టీమ్ నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. విద్యార్థినులు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని, సోషల్ మీడియా వేధింపులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో షీ టీం సిబ్బంది ఆనందం, శివకుమార్, అమ్రూనాయక్, పార్వతి, శారద పాల్గొన్నారు.

## గుండాల నుంచి ఆలయం వరకు పాదయాత్ర

కురవి, మార్చి 13 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల గ్రామానికి చెందిన ఇద్దరు భక్తులు ఎల్లబోయిన రవి, మేకల కృష్ణ కాలినడకన కురవి వీరభద్రస్వామి వారి ఆలయానికి బుధవారం తెల్లవారుజామున చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రథోత్సవం రోజున స్వామివారు, అమ్మవారిని దర్శించుకోవడం తమ ఆనవాయితీ అని తెలిపారు. సుమారు 100 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న స్వామివారిపై భక్తితో నడిచి వచ్చామన్నారు.

## విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి

దంతాలపల్లి, మార్చి 13: దేశంలో మహిళలపై జరుగుతున్న మోసాలు, సైబర్ నేరాలపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై తారాసింగ్ సూచించారు. గర్ల్ చైల్డ్ ఎంప్లాయిమెంట్ క్లబ్ (జీసీఈసీ) ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్‌లో విద్యార్థినులకు సైబర్ నేరాలు, వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వేణుమాధవ్‌రెడ్డి, మంజుల, సురేందర్‌గుప్తా, రమేశ్, వందన తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

తొర్రూరు, మార్చి 13: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సిలార్‌సాహెబ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు తాగునీరందేలా గతంలో వేసిన బోర్లను ఫ్లెషింగ్, చేతిపంపుల మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలన్నారు. అందుబాటులో ఉన్న ఓపెన్ బావులను అద్దెకు తీసుకుని 15వ ఫైనాన్స్ నిధుల నుంచి చెల్లించాలని, ఈజీఎస్ పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి గౌస్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీవో మధు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

నర్సింహులపేట, మార్చి 13: పురుగులమందు తాగి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని జయపురంలో బుధవారం జరిగింది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాసమల్ల ముఖేశ్ (21) డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. వారం రోజులుగా కళాశాలకు వెళ్లక పోవడంతో ఈ నెల 10న తండ్రి వెంకన్న మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన ముఖేశ్ ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## కుష్టువ్యాధి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

నెల్లికుదురు, మార్చి 13 : కుష్టు వ్యాధి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వనాకర్‌రెడ్డి అన్నారు. నెల్లికుదురు పీహెచ్‌సీ పరిధిలో ఆశ వర్కర్లు నిర్వహిస్తున్న ఇంటింటా సర్వేను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే ఈ నెల 24 వరకు ఆశ వర్కర్లు ఉద్యమంలా చేపడుతారన్నారు. ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి మందులు వాడితే నయమవుతుందన్నారు. 2027 నాటికి కుష్టు రహిత సమాజం కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను రూపొందించిందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి వంశీ కృష్ణ, విజయ్ కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నెల్లికుదురు పీహెచ్‌సీ పరిధిలో కుష్టువ్యాధి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది